క్లుప్తంగా

ప్రైవేటు స్కూళ్లలో ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోండి

జూపాడుబంగ్లా: విద్యాహక్కు చట్టం ప్రకారంగా ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యకోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ చిన్న మద్దిలేటి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారంగా ప్రతి ప్రైవేటు పాఠశాలలో 25 శాతం సీట్లు పేదపిల్లలకు కేటాయించాల్సి ఉందన్నారు. ఈ మేరకు మండలకేంద్రమైన జూపాడుబంగ్లాలో ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించటం జరుగుతుందన్నారు. 2019 జూన్ 2 నుంచి 2020 మే 31 మధ్య కాలంలో జన్మించిన వారు ఒకటో తరగతిలో స్టేట్ సిలబస్‌లో విద్యను అభ్యసించేందుకు అర్హులన్నారు. cse. ap. gov. in వెబ్‌సైట్‌లో ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కొలతల ప్రకారం పనులు చేస్తే అధిక కూలి



మస్టర్ రోల్ పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

పాములపాడు: ఉపాధి కూలీలు కొలతల ప్రకారం పని చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. బుధవారం మండలంలోని బానుముక్కల గ్రామంలో ఉపాధి పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయం 6గంటల్లోపే పనుల్లో ఉండాలన్నారు. తప్పని సరిగా తాగు నీటిని వెంట తెచ్చుకోవాలని చెప్పారు. ఏపీఓ అలివేలిమంగమ్మ, టీఏ, ఎఫ్ఏలు ఉన్నారు.

నేడు ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం

బండి ఆత్మకూరు: మండలంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో గురువారం సమావేశం నిర్వహించనున్నట్లు హౌసింగ్ ఏఈ వాసుదేవుడు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ రహిమాన్, ఎంపీడీఓ దస్తగిరి అధ్వర్యంలో ఉదయం 10:30 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఉంటుందన్నారు. ఇళ్ల నిర్మాణ స్థితిగతులపై సమీక్షిస్తామన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పగిద్యాల: వాహనదారులు తప్పనిసరి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ముచ్చుమర్రి ఇన్‌చార్జ్ ఎస్ఐ చంద్రశేఖర్ సూచించారు. బుధవారం లక్ష్మాపురం అంచె వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ ధరించడంతో పాటు వాహన రికార్డులు అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. రికార్డ్స్ సరిగా లేని వాహన చోదకులకు జరిమాన విధించారు.

తాగునీటి ట్యాంకులకు క్లోరినేషన్ తప్పనిసరి

జూపాడుబంగ్లా: జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశాల మేరకు ఈనెల 8 నుంచి 10 వరకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలోని తాగునీటి ఓవర్‌హెడ్, జీఎల్ఆర్ ట్యాంకులను తప్పనిసరిగా శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయించాలన్నారు. ట్యాంకులపై శుభ్రం చేసిన తేదీని తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. అలాగే నీటిపరీక్షలు నిర్వహించి వాటికి సంబంధించిన వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. 8 నుంచి మూడు రోజులపాటు తప్పనిసరిగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

సాక్షిగణపతికి విశేష పూజలు



సాక్షిగణపతి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణ పతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతి స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళం



దాతను సత్కరిస్తున్న ఆలయాధికారి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు బుధవారం హైదరాబాద్‌కు చెందిన బి.రాధాకృష్ణమూర్తి రూ.లక్ష విరాళాన్ని పర్యవేక్షకుడు జి.రవికి అందజేశారు. దాతకు దేవస్థానం తరుపున స్వామివారి శేషవస్త్రం, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

ఒకే చోట రెండు అంగన్‌వాడీ కేంద్రాలు

- ఇబ్బందులు పడుతున్న 80బన్నూరు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు
- ప్రజలకు అందుబాటులో ఉంచాలంటున్న గ్రామస్తులు
- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ సమస్యలేవనెత్తినా పట్టించుకోని సీడీపీఓ



80బన్నూరు గ్రామంలో ఎదురెదురుగా ఉన్న ఒకటి, రెండు అంగన్‌వాడీ కేంద్రాలు

జూపాడుబంగ్లా: మండలంలోని 80బన్నూరు గ్రామంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలను ఒకే చోట నిర్వహిస్తుండటంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా కాలనీల ప్రజలకు అందుబాటులో ఉండేలా అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ సువర్ణమ్మ సమస్య లేవనెత్తినా ఐసీడీఎస్ సీడీపీఓ పట్టించుకోకపోవటంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భవనం శిథిలం కావడంతో..

80బన్నూరు గ్రామంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. రెండో అంగన్‌వాడీ కేంద్రం గ్రామసచివాలయం పక్కన సొంతభవనంలో ఉంది. ఒకటో అంగన్‌వాడీ కేంద్రం మొదట్లో ఎస్సీ కాలనీలోని సొంతభవనంలో ఉండేది. ఏడేళ్ల క్రితం భవనం శిథిలం కావడంతో మూడేళ్ల పాటు అద్దెభవనంలో నిర్వహించారు. ఆ తరువాతం ఐసీడీఎస్ అధికారులు దానిని కూడా రెండో అంగన్‌వాడీ కేంద్రలోకే మార్చారు. ఏడాది క్రితం రెండో అంగన్‌వాడీ కేంద్రం ఎదురుగా ఉన్న పాత సచివాలయ భవనం ఖాళీ కావడంతో ఒకటోవ అంగన్‌వాడీ కేంద్రాన్ని అందులోకి షిఫ్ట్ చేశారు. దీంతో ప్రస్తుతం రెండు కేంద్రాలు ఒకేచోట ఉన్నాయి.

మూడేళ్లుగా ఇబ్బందులు

రెండో అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని బీసీ, ఎస్సీ, మైనార్టీ, తదితర కాలనీలకు చెందిన చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు కేంద్రం దూరం కావటంతో మూడేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై రెండు మాసాల క్రితం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ సువర్ణమ్మ అధికారుల దృష్టికి తీసుకెళ్లి.. అంగన్‌వాడీ కేంద్రాన్ని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుబాటులో ఉంచాలని కోరారు. అందుకు ఏసీడీపీఓ మంగవల్లి అంగీకరించినా.. ఇప్పటిదాకా ఒకటోవ అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రజలకు అనుకూలమైన ప్రదేశానికి మార్చిన దాఖలాల్లేవు. ఐసీడీఎస్ జిల్లా అధికారులు చర్యలు తీసుకొని అంగన్‌వాడీ కేంద్రాలను ప్రజలకు అందుబాటులో ఉంచేలా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా కన్యకా పరమేశ్వరి జయంతి





ప్రత్యేక అలంకరణలో వాసవీమాత,వాసవి అమ్మవారి వ్రతంలో పాల్గొన్న భక్తులు

నందికొట్కూరు: కన్యకా పరమేశ్వరిదేవి జయంత్రిని భక్తులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు నగరేశ్వరిదేవి గుడి నుంచి అభిషేక జలాలు తెచ్చి అమ్మవారికి అభిషేకం జరిపించారు. అమ్మవారి ఆలయానికి దాతలు వెండి వాకిలి చేయించి ఇవ్వగా.. వెండి వాకిలిని సీనియర్ సివిల్ జడ్జి ఏ. శోభా రాణి ప్రారంభించారు. అనంతరం 102 మంది జంటలు 10 గంటల నుంచి మధ్యాహ్నం 1. 30 గంటలకు వాసవి మాత వ్రతం చేశారు.కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నాగసత్యానారాయణ, కార్యదర్శి జయరాం,నాగేశ్వరరావు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వాసవీమాత జయంతి వేడుకలు

ఆత్మకూరు: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకలకు కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి హాజరై అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నరహరి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యంగ హోమం, జపపారాయణం, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, క్షీరతర్పనం వంటి పూజలు చేశారు. అనంతరం వాసవీమాత మూలవిరాట్ విగ్రహానికి క్షీరాభిషేకం, నవగ్రహ, అవాయుత దేవతాహోమాలు, బలిహారం, మధ్యాహ్నం కూష్మాండ బలి కార్యక్రమాలను చేపట్టారు. మహాపూర్ణాహుతి అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అమ్మవారి అనుగ్రహ దర్శనం, వేదసుస్తి, కలశ ఉద్వాసన, కుంభాభిషేకం, దీక్షా విరమణ, ఆశీర్వాదాలు జరిగాయి. సాయంత్రం మంగళ వాయిద్యాలు, మేళతాళాల నడుమ పట్టణ వీధుల్లో అమ్మవారి గ్రామోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు.

సర్వేలను నిర్లక్ష్యం చేయరాదు

పాములపాడు: ప్రభుత్వం అమలు చేసిన జీఎస్‌డబ్ల్యూఎస్ సర్వేలను నిర్లక్ష్యం చేయరాదని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని కొత్తబానకచెర్ల గ్రామంలో గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. సర్వేల పై ఆరా తీశారు.ఇంత వరకు పూర్తి చేయకపోడవంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



ప్రతిష్ఠించనున్న దేవతా విగ్రహాలు

కొత్తపల్లి: మండలంలోని సింగరాజుపల్లె గ్రామంలో సీతారామచంద్ర స్వామి, కామాక్షి సమేత శ్రీ కాశీ విశ్వనాథ స్వామి, పరివార దేవతల నాభిశిల విగ్రహ ప్రతిష్ట మహోత్సవ పూజలు గ్రామపెద్దలు, భక్తుల సమక్షంలో బుధవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనము, యాగశాల ప్రవేశం, పంచగవ్య ప్రాశన, ఋుత్వీకరణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపనం, శాంతి హోమం, జలాధివాసం తదితర కార్యక్రమాలు శ్రీనివాస శర్మ పర్యవేక్షణలో జరిగాయి.

శ్రీశైల ద్వార క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు

శ్రీశైలంటెంపుల్: లోక కల్యాణం కోసం గురువారం నుంచి నాలుగు రోజుల పాటు శ్రీశైల ద్వార క్షేత్రాల్లో అక్కడి ఆది దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. చుతుర్ద్వార అర్చనగా పిలిచే ఈ కార్యక్రమం ఏటా వైశాక శుద్ద ఏకాదశి నుంచి ఆయా ద్వార క్షేత్రాల్లో నిర్వహిస్తారు. ఈ నెల 12న శ్రీశైలంలో స్వామి అమ్మవార్లకు విశేష పూజలు చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని గిరిప్రదక్షిణ అనే పేరుతో కూడా పిలుస్తారు. ఈ అర్చనలో ప్రతి ఆలయంలో స్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి సహస్ర నామార్చనలు, తదితర పూజలు జరిపిస్తారు. విశేష కైంకర్యంలో శ్రీశైల దేవస్థానం తరుపున ప్రతి ఆలయంలో అక్కడి ఆది దేవతలకు వస్త్రాలు సమర్పిస్తారు. గురువారం శ్రీశైలక్షేత్ర తూర్పు ద్వారమైన ప్రకాశం జిల్లాలోని త్రిపురాంతకం, 9న దక్షిన ద్వారమైన వైఎస్సార్‌కడప జిల్లాలోని సిద్దవటం, 10వ తేదీ పశ్చిమ ద్వారమైన తెలంగాణ రాష్ట్రంలోని జోగుళాంబదేవి, 11న నాగర్‌కర్నూలు జిల్లాలోని ఉత్తర ద్వారమైన ఉమా మహేశ్వరస్వామి ఆలయాల్లో ఈ పూజలు నిర్వహిస్తారు.

కనుల పండువగా మహానందీశ్వరుడి కల్యాణం

మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవం బుధవారం కనుల పండువగా నిర్వహించారు. వేదపండితుడు చెండూరి రవిశంకర అవధాని ఆధ్వర్యంలో స్థానిక అలంకార మండపంలో ముందుగా స్వామి, అమ్మవార్లను కొలువుంచి గణపతిపూజ, పుణ్యాహవాచనం, మాంగళ్యధారణ, అక్షత సమర్పణ పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. కల్యాణం అనంతరం భక్తులకు స్వామి, అమ్మవారి ప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రి యాగశాలలో మహానందీశ్వరుడి దంపతులకు ఏకాంత సేవ నిర్వహించారు.

రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోండి

జూపాడుబంగ్లా: నూతన రేషన్ కార్డుల కోసం గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూతన రేషన్‌కార్డులు, రేషన్‌కార్డుల్లో చిరునామ, పేర్లు, చేర్పులు, మార్పులతోపాటు రేషన్‌కార్డుల సరెండర్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. కొత్తగా రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకునేవారి వార్షిక ఆదాయం రూ.1.2లక్షల్లోపు ఉండాలన్నారు. జీఎస్‌డబ్ల్యూఎస్ హౌస్‌హోల్డ్ డేటాబేస్‌లో నమోదై ఉండి కుటుంబసభ్యుల్లో ఎవరికీ రేషన్‌కార్డు ఉండరాదన్నారు. అలాంటి వారు కుటుంబ సభ్యులు వారి ఆధార్‌కార్డుల జిరాక్సులతో మే నెలాఖరులోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బండి ఆత్మకూరు: అర్హత కలిగిన కుటుంబాలు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ పద్మావతి అన్నారు. కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, ధ్రువీకరణ పత్రాలతో ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎంఈఓ-1ను నియమించాలి

నందికొట్కూరు: మిడుతూరు మండల విద్యాశాఖధికారి-1ను తక్షణమే నియమించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు డిమాండ్ చేశారు. బుధవారం మిడుతూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న ఎంఈఓ ఫైజున్నీసా బేగం సెలవులో ఉన్నందున పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల వేతనాలు, పదోన్నతులు, హేతుబద్ధీకరణ, బదిలీలు తదితర ప్రకియలు జరుగుతున్నట్లు ఆయన గుర్తు చేశారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని మిడుతూరు మండలానికి ఎంఈవో-1 ఎఫ్ఏసీ అధికారిని వెంటనే నియమించాలని కోరారు. సమావేశంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్ప్డు శేషయ్య, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు



కమిషనర్‌కు నోటీసు అందజేస్తున్న కార్మికులు

ఆత్మకూరు: మున్సిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ చెల్లించాలని, ఆప్కాస్‌ను యథావిధంగా కొనసాగించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఉపాధ్యక్షుడు రణధీర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, పెద్ద నాగరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రమేష్‌బాబును కలిసి ఈనెల 20న చేపట్టే సమ్మె నోటీసును అందజేశారు. కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. ఆప్కాస్‌ను రద్దు చేసే నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ఈనెల 20, 21, 22 తేదీల్లో సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు.

చలువ పందిళ్ల ఏర్పాటు



సంగమేశ్వర ఆలయం ప్రాంగణంలో వేసిన చలువ పందిళ్లు

కొత్తపల్లి: మండలంలోని సప్తనదీ సంగమ ప్రాంతంలో వెలసిన ప్రాచీన శ్రీ లలితా సమేత సంగమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సహకారంతో ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ ఆధ్వర్యంలో చలువ పందిళ్లను బుధవారం ఏర్పాటు చేశారు. మేనెలలో సుమారు 45 డిగ్రీల వరకు వేడిమి ఉంటుందనే ఉద్దేశంతో స్వామి వారి దర్శనార్థం వచ్చిన భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు చలువ పందిళ్ళు ఏర్పాటు చేశారు. దిగువ, ఎగువ ఆలయాల వద్ద సుమారు 17 వేల అడుగుల విస్తీర్ణం వరకు చలువ పందిళ్లు వేయడం విశేషం.

నన్నారి సాగు లాభదాయకం



నన్నారి మొక్కలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ

పగిద్యాల: నన్నారి సాగు లాభదాయకమని శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ ధనుంజయ అన్నారు. చెంచులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఆశయంతో 50 శాతం సబ్సిడీ కింద సాగు చేయించిన నన్నారి పంటలను పరిశీలించారు. బుధవారం స్థానిక చెంచు కాలనీకి చెందిన ఓబులేసు, వెంకటేశ్వర్లు, గోవిందు రైతులు సాగు చేసిన నాలుగు ఎకరాల్లోని నన్నారి పంటను క్షేత్రప్రదర్శన చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అడవుల్లో నన్నారి మొక్కలు అంతరించి పోవడం వలన ప్రభుత్వం చెంచుల భూముల్లో నన్నారి సాగు చేసేందుకు 50 శాతం సబ్సిడీ అందిస్తోందన్నారు. దీర్ఘకాలిక పంట కావడం వలన రైతులు ఎక్కువగా ఆసక్తి చూపడం లేదని, ఈ ఏడాది కేవలం నాలుగు ఎకరాల్లో మాత్రమే సాగు చేయించామని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆయన వెంట ఏపీఓ నాగార్జున, ఏఈఓ షఫీవుల్లా తదితర రైతులు ఉన్నారు.

కౌలు రైతులను గుర్తించండి

కొత్తపల్లి : మండలంలోని అన్ని గ్రామాల్లో కౌలు రైతులను గుర్తించి కౌలు పత్రాలు మంజూరు చేయాలని తహసీల్దార్ ఉమారాణి ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కౌలు హక్కు పత్రాలపై గ్రామ రెవెన్యూ అధికారులు, రైతు సేవ కేంద్ర సిబ్బందితో మండల వ్యవసాయాధికారి కె.మహేష్ ఆధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ పొలం కౌలు చేసుకుంటున్న రైతులను గుర్తించి పంట సాగు హక్కు పత్రాలను మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, ఆర్ఐ అరుణ తదితరులు పాల్గొన్నారు.

మే డే స్ఫూర్తితో ఉద్యమించాలి

ఆత్మకూరు: మే డే స్ఫూర్తితో కార్మికులు, కర్షకుల హక్కుల కోసం ఉద్యమించాలని సీపీఎం నాయకులు ఎ.రాజశేఖర్, రణధీర్, సీఐటీయూ నాయకుడు రాంనాయక్ అన్నారు. బుధవారం మండలంలోని కురుకుంద గ్రామంలోని నాలుగు సెంటర్లలో జెండాలను ఆవిష్కరించారు. నాడు ప్రాణ త్యాగం చేసి 8 గంటల పనిదినాలు సాధించుకుంటే నేడు పాలకులు చట్టాలు మార్చుతూ పని గంటల పెంపుకు నాంది పలుకుతున్నారన్నారు. మేడే స్ఫూర్తితో హక్కుల సాధన కోసం కార్మికవర్గం ఉద్యమించాలన్నారు.

సత్తాచాటిన బి.తాండ్రపాడు ఎద్దులు



బండలాగుతున్న వృషభాలు

కృష్ణగిరి: మండలంలోని అమకతాడు గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పాలపళ్ల ఎద్దుల బండలాగుడు పోటీల్లో కర్నూలు జిల్లా బి.తాండ్రపాడు వృషభాలు విజేతగా నిలిచాయి. పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి 8 జతల వృషభాలు పాల్గొనగా బి.తాండ్రపాడు గ్రామానికి చెందిన ఆకేపోగు వరలక్ష్మి వృషభాలు ప్రథమ స్థానంలో నిలిచాయి. రెండో స్థానంలో పెద్ద కొట్టాలకు చెందిన బోరెడ్డి నారాయణరెడ్డి, మిడుతూరుకు చెందిన సాయివర్ధన్ వృషభాలు ఉమ్మడిగా, మూడో స్థానంలో పసుపుల గ్రామానికి చెందిన డి.కృష్ణ, రాయలచెర్వుకు చెందిన రామచంద్రారెడ్డి వృషభాలు ఉమ్మడిగా, నాల్గో స్థానంలో నంద్యాల జిల్లా, సంజామల మండలం, కానాల గ్రామానికి చెందిన గుండం చెన్నారెడ్డి వృషభాలు, ఐదో స్థానంలో డోన్ మండలం యాపదిన్నె గ్రామానికి చెందిన కట్టల అరవిందు, సంజామల మండలం, చిన్న కానాల గ్రామానికి చెందిన సుంకన్న వృషభాలు ఉమ్మడిగా గెలుపొందాయి. ఎద్దుల యజమానులకు దాతలు, ఆలయ కమిటీ సభ్యులు వరుసగా రూ. 30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ. 5వేలు, రూ.3వేలు అందజేశారు.

నేడు న్యూ కేటగిరి విభాగంలో పోటీలు..

గురువారం న్యూ కేటగిరి విభాగంలో బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి వరుసగా రూ. 40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ. 5వేలను అందిస్తున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నవగ్రహాల ప్రతిష్ట





నవగ్రహ హోమంలో భక్తులు,:నూతనంగా ప్రతిష్ఠించిన నవ గ్రహాల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామ పంచాయతీ మజరా గ్రామం క్రిష్ణరావుపేటలో బుధవారం నూతన నతవగ్రహాల విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని శివాలయంలో నూతన నవ గ్రహాల ప్రతిష్ఠతో పాటు నూతనంగా నిర్మాణం చేపట్టిన శ్రీమల్లికార్జున స్వామి వారి కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పురోహితులు గణపతి పూజ, పుణ్యాహవాచనము, నవగ్రహ పూజ, గణపతి హోమం, నవగ్రహ హోమం, వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి తహసీల్దార్ సుభద్రమ్మ, డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ సుప్రియ, ఆర్ ఖాజాబీ, సింగిల్ విండో మాజీ చైర్మన్ హరిసర్వోత్తమరావు, నీటి సంఘం డైరెక్టర్ సన్ని, నిర్వాహకులు రామక్రిష్ణ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతులు ప్రకృతి వ్యవసాయంలో రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం అంబమ్మ

జూపాడుబంగ్లా: మహిళా రైతులు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడి ప్రకృతి వ్యవసాయంలో రాణించాలని ఏపీఎం అంబమ్మ అన్నారు. బుధవారం మండ్లెం గ్రామంలో జీవనోపాధుల కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మొదటి విడతగా మండ్లెం, తర్తూరు, తంగడంచ గ్రామాల్లోని మహిళా రైతులను గుర్తించి పదిమంది చొప్పున ఓ గ్రూపును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటి దాకా ఈ మూడు గ్రామాల్లో 15గ్రూపులు ఏర్పాటు చేశామన్నారు. ఇంకా ఎవ్వరైనా మహిళ రైతులు ఉంటే వారిని గుర్తించి ఎఫ్‌పీఓ (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్) గ్రూపులుగా ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీసీలు గాంధీ, కర్రెన్న, జయలక్ష్మి, ధన్సింగ్‌నాయక్, నాగేశ్వరరావు, దేపాల్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి మృతి

నందికొట్కూరు: మండల పరిధిలోని శాతనకోట గ్రామంలో ఓ వ్యక్తి ఉరేసుకుని మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ తిరుపాలు తెలిపిన మేరకు వివరాలు.. శాతనకోటకు చెందిన తెలుగు వీరనారాయణ(35) ఆర్థిక పరిస్థితి బాగులేక అప్పులు చేశాడన్నారు. వాటిని అప్పులను చెల్లించలేక ఇంట్లో రాత్రి కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతి చెందాడు. భార్య వెంకటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నిలిచిన ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ పరిధిలో నిలిచిన ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ తిరుపాలు తెలిపిన విరవాలు ఇలా ఉన్నాయి. కర్నూలు నగరానికి సమీపంలో ఉన్న ఉల్చాల గ్రామానికి చెందిన పైపాటి మధుకుమార్(30) మండల పరిధిలోని మల్యాల సబ్ స్టేషన్‌లో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం బైక్‌పై విధులకు వస్తుండగా రోడ్డుపై పంక్చర్ అయి నిలిచిన ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో అక్కడకక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి అయ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య మహాలక్ష్మి, నలుగురు పిల్లలు ఉన్నారు.

నిజాయితీకి మారు పేరు దామోదరం



నివాళులర్పిస్తున్న మాలమహానాడు నాయకులు

నందికొట్కూరు: నీతికి నిజాయితీకి మారు పేరైన మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జీవితాన్ని యువత ఆదర్శం తీసుకోవాలని మాలమహానాడు నాయకులు పబ్బతి శివప్రసాద్ అన్నారు. బుధవారం దామోదరం సంజీవయ్య వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని మాలమహానాడు కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అని, పేదలకు సంక్షేమ పథకాలు అందించి చరిత్రలో నిలిచారన్నారు. పింఛన్ పథకం తెచ్చించిన ఘనత ఆయనకే దక్కిందని చెప్పారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నాగన్న, విల్సన్, రాజు, నాగేంద్ర, పరమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు చట్టాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శోభారాణి

నందికొట్కూరు: అసంఘిటిత కార్మికులకు చట్టాలు సామాజిక భద్రతా చట్టం, కనీసం వేతనం, కార్మిక చట్టాలపై అవగాహన కల్పించాలని సీనియర్ సివిల్ జడ్జి ఏ. శోభారాణి సూచించారు. బుధవారం పట్టణంలోని కోర్టు చాంబర్‌లో ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు ఇంటర్నేషనల్ లెబర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కార్మిక చట్టాలపై పోలీసు అధికారులకు, లేబర్ అధికారులకు అవగాహన ఉండాలన్నారు. ఈ చట్టాల అమలు కోసం ప్రత్యేక శ్రద్ధ చూపించాలని చెప్పారు. సీఐలు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, ఎస్ఐలు చంద్రశేఖర్, లక్ష్మినారాయణ, తిరుపాలు, ఓబులేసు తదితరులు ఉన్నారు.

104 సేవలను సద్వినియోగం చేసుకోండి



గువ్వలకుంట్లలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: గ్రామాలలో 104 వాహనం ద్వారా అందించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు మహమ్మద్ బేగ్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జలుబు, దగ్గు, జ్వరము, ఒంటి నొప్పులు, షుగరు, టీబీ, బీపీ, మలేరియా ఇతర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గ్రామాలలో 104 వాహనం ద్వారా ప్రతినెల మొదటి బుధవారం నిర్వహించే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.